క్లుప్తంగా

నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నగరి : పట్టణ పరిధిలో వివిధ రకాల సేవలు అందించే వారికి మెప్మా ద్వారా నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు సిటీ మిషన్ మేనేజర్ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్ వాషింగ్ మిషన్ మరమ్మతులతోపాటు బ్యూటీషియన్ సేవలు అందించే వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎన్ఎస్‌డీసీ, ఎస్‌డీసీ, ఎన్ఏసీ సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్‌తో పాటు జీవనోపాధి కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 31లోపు మెప్మా కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం వచ్చే నెల 17వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ఉంటుందని, అర్హత గల అభ్యర్థులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్సుల, ఫోటోలు -2 తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు ఎన్.ప్రసాద్, సిటీ మిషన్ మేనేజర్ 86396 81312, 86396 88380, 86397 08256, 86396 93506ను సంప్రదించవచ్చు.

శ్రీహరిపురంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

విజయపురం : మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలు చేసి చూపించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు విజయచంద్రిక మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి, నూతన ఆవిష్కరణలకు వెలుగులోనికి రావడానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. పాఠశాల స్థాయిలో విజేతలు శనివారం మండల స్థాయిలో నిర్వహించే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపి, రాధాకుమారి, సునీత, వెంకటేశు, విజయవర్మ, వెంకమరాజు పాల్గొన్నారు.

వంట కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలి



డీఈఓకి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నగరి : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులు జీతాలు మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య కోరారు. డీఈఓ వరలక్ష్మి నగరి పీసీఎస్ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఏఐటీయూసీ నాయకులు ఆమెను కలిసి మధ్యాహ్న భోజనం కార్మికులు, ఆయాలకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే అందజేస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రం ఇచ్చారు. స్థానిక హెచ్‌ఎంలను ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. నిత్యవసర ధరలు పెరిగిపోవడంతో కార్మికుల బతుకు చాలా అధ్వానంగా ఉన్నాయని గుర్తు చేశారు. దీనిపై స్పందించిన డీఈఓ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వేలన్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



దేశమ్మ ఆలయంలో అమ్మవారి క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు, దాతలు

నగరి : పట్టణ పరిధిలోని టీఆర్ కండ్రిగలో వెలసిన శ్రీ దేశమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు క్యాలెండర్ ఆవిష్కరించి భక్తులకు అందజేశారు. దాతలు ఆనందరెడ్డి, శంకర్‌హరితో పాటు భక్తులు, పెద్దలు గుణశేఖర్, జ్యోతినాయుడు, కృష్ణారెడ్డి, దూర్వాసులునాయుడు, మదన్‌కుమార్, వెంకటాచలం, సుబ్బయ్య, రజనీకుమార్, అశోక్, మోహనకృష్ణ, నీలకంఠం, చెంచయ్య పాల్గొన్నారు.

రూ.14.52 లక్షలకు మార్కెట్ గేటు టెండరు ఖరారు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని మునిసిపల్ ప్రధాన కూరగాయల మార్కెట్‌లో గేటు రుసుములు వసూలు చేసుకునే కాంట్రాక్ట్‌ను రూ.14.52 లక్షలకు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు మార్కెట్ గేటు వసూలు చేసుకోవడానికి కార్పొరేషన్ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. మునిసిపల్ అధికారుల పాట రూ.14.50లక్షలుగా నిర్ణయించారు. బి.గోపినాథ్‌రావు అనే వ్యక్తి రూ.14.52 లక్షలకు మార్కెట్‌ను దక్కించుకున్నారు. ఇక జంతు వధశాలను రూ.47 వేలు, పాత బస్టాండులో పార్కింగ్ రుసుముల టెండర్‌ను రూ.1.83 లక్షలకు కె.శేషాద్రినాయుడు దక్కించుకున్నాడు.

రోడ్డెక్కిన జగనన్న సైన్యం



పుత్తూరు: బైక్ ర్యాలీలో మాజీ మంత్రి రోజా



ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి రోజా



విద్యుత్ చార్జీలు తగ్గించాలని ట్రాన్స్‌కో ఏడీఈకి వినతి పత్రం ఇస్తున్న కృపాలక్ష్మి

- విద్యుత్ చార్జీలు తగ్గించేవరకు పోరాటం ఆగదు : రోజా
- దద్ధరిల్లిన పుత్తూరు పట్టణం
- ఎన్నికల హామీలకు 'బాబు' మంగళం
- ఆరు నెలల్లోనే కరెంటు చార్జీల పెంపుతో ప్రజలకు షాక్
- బాబు సర్కారుపై మండిపడిన వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి

పుత్తూరు: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా దళం శుక్రవారం పుత్తూరు పట్టణంలో కదం తొక్కింది. ముందుగా స్థానిక ఆరేటమ్మ ఆలయంలో రోజా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె స్కూటర్ నడుపుతూ బైక్ ర్యాలీ ప్రారంభించగా పార్టీ శ్రేణులు అనుసరించారు. కార్వేటినగరం రోడ్డు, బజారువీధి, తేరువీధి, సర్వీసు రోడ్డు, పాత తిరుపతి రోడ్డు, తొరూరు రోడ్డు మీదుగా ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ప్రజల సమస్యలపై పోరాటం షురూ చేసిన వైఎస్సార్ సీపీకి మద్దతుగా స్థానికంగా ఉన్న పవర్‌లూమ్ కార్మికులు జత కలిశారు. మాజీ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు అన్ని వర్గాల వారినీ మోసం చేసిందని ఆరోపించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం విద్యుత్ శాఖ అధికారికి పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలంటూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పుత్తూరు, నగరి మున్సిపల్ చైర్మన్లు హరి, నీలమేఘం, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, బాలన్, వెంకటరత్నంరెడ్డి, ఎంపీపీలు మునివేలు, దీప, వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, కన్నియప్ప, ఢిల్లీ, వైఎస్సార్ సీపీ నాయకులు గాంధీ, ఏకాంబరం, మనోహర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, భాస్కర్‌యాదవ్, జయచంద్రన్, ప్రసాద్, దిలీప్‌మొదలి, మాహీన్, తులసీ, చిన్నా, కార్తికేయన్, వనిత, వెంకటేశులు, ఈశ్వరయ్యయాదవ్, జయరామ్‌రెడ్డి, మునిరత్నం, గోపి, చిరంజీవి, శ్యామ్‌లాల్, సురేష్‌రాజు, వేణురాజు, వెంకటరెడ్డి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే గుణపాఠం చెబుతారు

కార్వేటినగరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని జీడీ నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం ఎంపీపీ లత, మండల కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఆరు మండలాల నాయకులతో కలసి వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించి కృపాలక్ష్మి మాట్లాడారు. అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచం.. అవసరమైతే తగ్గిస్తాం అంటూ ఎన్నికల ముందు ఊరూరా ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే భారీగా విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారులకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో కూటమి నాయకులను గ్రామాల్లో ప్రజలే నిలదీయడం ఖాయమన్నారు. తొలుత స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ఆర్చి నుంచి మండల కార్యాలయాల సముదాయంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వరకు పోరుబాట ర్యాలీ నిర్వహించారు. జైజగన్, జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిలాలి నినాదాలతో హోరెత్తించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆ తర్వాత ట్రాన్స్‌కో ఏడీఈకి వినతి పత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్లు శేఖర్‌రాజు, మణి, పద్మనాభరెడ్డి, విజయకుమారెడ్డి, జెడ్పీటీసీలు అన్బళగన్, సుకుమార్, వైస్ ఎంపీపీలు హరిబాబు, బట్టే సుబ్రమణ్యం, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు వేల్కూరు బాబురెడ్డి, లోకనాధరెడ్డి, చందురాజు, జిల్లా రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గురవారెడ్డి, మాజీ మండల కన్వీనర్ మహాసముద్రం సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ, మునిరాజరెడ్డి, దూదిమోహన్, జనార్ధన్, కుప్పయ్య, పురంధర్, మురగయ్య, శేషాద్రి, శివప్రకాష్ మొదలియార్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పుత్తూరు: విద్యుత్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



కార్వేటినగరం: వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కృపాలక్ష్మి

శ్రీకృష్ణ మందిరం పనుల పరిశీలన

నింద్ర: మండలంలోని పాదిరి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ స్వామి ఆలయ పనులను శుక్రవారం మాజీ మంత్రి రోజా పరిశీలించారు. గతంలో పాడుపడిన ఆలయం మాత్రమే ఉండేది. నాలుగు దశాబ్దాలుగా అందులోనే పూజలు చేస్తూ వచ్చారు. నూతన ఆలయాన్ని నిర్మించాలని ఇక్కడ ప్రజలు కలగా ఉండేది. మంత్రిగా ఉన్న రోజాకు గ్రామస్తులు తమ కోరికను విన్నవించుకోగా వెంటనే స్పందించిన మంత్రి ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించగా ఆలయం పనులు ప్రారంభించారు. నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని ఆమె పరిశీలించారు. స్థానికులు ఫ్లోరింగ్, అవసరమైన టైల్స్, విగ్రహం కావాలని కోరగా, వెంటనే తన సొంత చారిటబుల్ ట్రస్టు ద్వారా చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, సర్పంచ్ సూర్య పాల్గొన్నారు.



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మాజీ మంత్రి రోజా

విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం



దామోదరం దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కార్వేటినగరం: వృత్తి పట్ల గౌరవం, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులకు ప్రజల్లో ఎప్పటికీ గుర్తింపు, మర్యాద లభిస్తుందని పాదిరి కుప్పం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సుప్రసన్న అన్నారు. శుక్రవారం ఆ స్కూలు సోషల్ టీచర్ పి.దామోదరం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా దామోదరం దంపతులను సన్మానించి ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆయన సేవలను ప్రస్తుతించారు. పదో తరగతిలో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఆయన ఎంతగానో కృషి చేసేవారని అన్నారు. కార్వేటినగరం, వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, పాలసముద్రం మండలాల నుంచి వచ్చిన టీచర్లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు దామోదరం దంపతులను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్ గురుమూర్తి, ఢిల్లీబాబు, ఎల్లయ్య, పుష్పలత, మునికృష్ణయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్ సింగ్

కార్వేటినగరం: ఆర్థిక సంస్కరణల సారథి, మాజీ భారత ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ అని ఎంపీపీ లత స్మరించారు. శుక్రవారం స్థానిక గాండ్లమిట్ట కూడలిలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కళత్తూరు కృపాలక్ష్మి ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఎంపీపీతో పాటు కృపాలక్ష్మి మాట్లాడారు. మన్మోహన్ సింగ్ ప్రపంచం మెచ్చిన రాజనీతిజ్ఞుడని మేధావుల చేత ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు. ఆయన మార్గంలో అందరూ నడచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, చందురాజు, కార్తీక్‌రెడ్డి, శేషాద్రి, మణి, సుకుమార్, వేల్కూరు బాబురెడ్డి, అంబిక, కృష్ణయాదవ్, గోపి, ధనశేఖర్ యాదవ్, సుమతి, శేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఆనంద్, శివప్రకాష్ మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.



మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మామిడి పంటకు బీమా చేసుకోండి

పెనుమూరు (కార్వేటినగరం): మామిడి పంటకు బీమా చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి రైతులను కోరారు. శుక్రవారం పెనుమూరు మండలంలోని పులిగుండు వద్ద ఉన్న మ్యాంగో భవన్‌లో పులిగుంటేశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మామిడి, ఇతర ఉద్యాన పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖాధికారి మాట్లాడారు. మామిడి రైతులు ఈ నెలాఖరు లోపు బీమా చేసుకోవాలన్నారు. ఎకరానికి రూ.1750 చెల్లించి బీమా చేసుకుంటే మంచిదన్నారు. అనంతరం మామిడిలో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మామిడి చెట్లలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను శాస్త్రవేత రంజిత్‌కుమార్, అలాగే ఖాదీ బోర్డు ద్వారా రైతులకు అందే రాయితీ, ఉపాధి కల్పన పథకం గురించి ఖాదీ బోర్డు అధికారి ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో పులిగుంటేశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ పి.హరికృష్ణారెడ్డి, సీఈఓ చందన, పెనుమూరు రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ జగన్నాథరెడ్డి, జ్ఞానశేఖర్, సంధ్య, ఝాన్సీ, సుప్రియ, తిరుపతి ఆకాశవాణి అధికారి రఘు, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి

టార్పాలిన్ల కోసం పడిగాపులు

కూటమి ప్రభుత్వ వైఫల్యం వల్ల పంటల దిగుబడి సమయంలో ప్రకృతి కన్నెర్ర చేస్తే వాటిని ఎలా కాపాడుకోవాలో అర్థం కావడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల అవసరాలను ఆసరా చేసుకుని వ్యాపారులు టార్పాలిన్ల ధరలు పెంచడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. గత ప్రభుత్వం 50 శాతం రాయితీతో టార్పాలిన్లను రైతులకు అందించింది. కూటమి ప్రభుత్వం ఇంత వరకు టార్పాలిన్లను అందించకపోవడంతో రైతులు తమ పంటలను కాపాడుకోవడం కోసం నానా తంటాలు పడుతున్నారు.



వరి ధాన్యంపై కప్పిపెట్టిన టార్పాలిన్ (ఫైల్)

- గత ప్రభుత్వంలో రాయితీపై టార్పాలిన్లు
- కూటమి పాలనలో రాయితీకి మంగళం
- ప్రైవేటు వారి వద్ద అధికంగా ధరలు

విజయపురం : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఆరబెట్టేందుకు టార్పాలిన్ల అవసరం ఉంది. తేమ శాతం తగ్గించేందుకు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. పంటను రక్షించేందుకు టార్పాలిన్ పట్టలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి, మంచుకు తడిస్తే తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల ధరలో కోత విధిస్తారని చెబుతున్నారు. గత ప్రభుత్వం రైతులకు అవసరాలను గుర్తించి టార్పాలిన్లను 50 శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటి గురించి అసలు పట్టించుకోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో రైతులు ప్రైవేటు మార్కెట్‌లో అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

ప్రైవేటు వారి వద్ద అధిక ధరలు

వర్షాల కారణంగా టార్పాలిన్ల అవసరం ఉందని గమనించిన వ్యాపారులు సైతం వీటి ధరలను అమాంతం పెంచేశారు. ప్రస్తుతం నగరి, పుత్తూరు ప్రాంతాల్లో ఆయా కంపెనీలు 8కి 8 టార్పాలిన్ ధర రూ.1,200 ఉంటే, 18కి 24 ధర రూ.2,300, 24కి 30 ధర రూ.3,000 దాకా ధరలు పలుకుతున్నాయి. రైతులు తమ పంటలను తేమ శాతం నుంచి కాపాడుకోవడం కోసం అధిక ధరలు చెల్లించి టార్పాలిన్లను కొనుగోలు చేస్తున్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం


తుపాన్లు ముసురు వర్షాల కారణంగా ఇప్పటికే ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని తడవకుండా చూసుకోవాలంటే టార్పాలిన్లు ఉండాల్సిందే. ఇదే కాకుండా వరి గడ్డి, పశువుల పాకలు, పొలాల వద్ద రైతుల ఉత్పత్తులు, ధాన్యాన్ని ఎండబెట్టుకోవాలన్నా ఇవి ఉండాల్సిందే. ఏదేమైనా కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన పథకాలను అమలు చేయకపోవడంపై అన్నదాతలు మండిపడుతున్నారు.

> **టార్పాలిన్లు ఇవ్వాలి**
>
> ప్రస్తుతం వర్షం పడుతుండడంతో రైతులకు టార్పాలిన్లు ఎంతో అవసరం. వరి, పశుగ్రాసం, నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఎండబెట్టుకోవడానికి ఎక్కువగా ఉపయోగపడుతుంది. గత ప్రభుత్వం 50శాతం రాయితీతో ఇచ్చింది. ఈ ప్రభుత్వం కూడా టార్పాలిన్లు ఇవ్వాలని కోరుతున్నాం.
>
> – భాస్కర్‌రెడ్డి, రైతు, కలియంబాకం

రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

- ప్రజలు, వాహనదారులకు అగచాట్లు

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఎడతెరపిలేని వర్షంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టల నుంచి వర్షపు నీరు ప్రవహించే సప్లయ్ చానల్ తెగిపోయింది. ఆ కాలువను మూడేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పుడు వర్షాలకు ఆవలకొండ ఐజెడ్ఎం స్కూల్ కండిగ దళితవాడకు సమీపంలో తారు రోడ్డుపై వర్షపు నీరు ఏరులా సాగుతోంది. ఫలితంగా ఆ మార్గంలో రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే తూగుండ్రంలోని హాస్టల్‌కు సమీపంలో చెరువు మొరవ పారింది. అంతేకాకుండా చెరువు మొరవ సైతం దెబ్బతింది.



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పచ్చకామెర్ల వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధర నెల్లూరు: మండలంలోని వెజ్జుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మెడికలాఫీసర్ డాక్టర్ పీఏ దుర్గాదేవి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని నీళ్ల ట్యాంకును పరిశీలించారు. గ్రామస్తులకు పచ్చ కామెర్ల వ్యాధిపై అవగాహన కల్పించారు. అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్తాఫీసర్ పి.శ్రీనివాసులు, సర్పంచ్ హరి ప్రసాద్ రెడ్డి, శైల, ధర్మేంద్ర, మాలతి , ఈశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.